# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 09 అక్టోబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 86

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

**తప్పిన ఎగ్జిట్ పోల్ అంచనాలు**

## మెట్రో రెండోదశ అంచనా వ్యయం రూ.24,269 కోట్లు



హైదరాబాద్: రాజధాని మెట్రోరైలు రెండోదశలో ఐదు మార్గాల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. 76.2 కి.మీ.కు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్‌లో అధికారులు పేర్కొన్నారు. ఫోర్త్‌సిటీ మినహా మిగిలిన ఐదు కారిడార్లకు వేర్వేరుగా నివేదికలు ఇచ్చారు. దసరా నాటికి డీపీఆర్‌లు సమర్పించాలని ప్రభుత్వం తొలుత నిర్దేశించింది. ఈ నెల 7న (సోమవారం) దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో సీఎం భేటీ ఖరారు కావడంతో.. ఆ పర్యటనకు ముందుగానే డీపీఆర్‌లు కావాలని సీఎం కార్యాలయం కోరింది. దీంతో ఏడో తేదీ నాటికి డీపీఆర్‌లను ప్రభుత్వానికి సమర్పించామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) అధికారులు తెలిపారు. నివేదికలు గతంలోనే సిద్ధమైనా కీలకమైన ట్రాఫిక్ అధ్యయన నివేదిక 'కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)' కోసం ఆగారు. సీఎంపీ ముసాయిదా సిద్ధం కావడంతో ఆ నివేదికను డీపీఆర్‌కు జోడించి సర్కారుకు అందజేశారు. దీని ఆధారంగానే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీపీఆర్‌లు పంపనున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్రం సైతం సానుకూలంగా ఉన్నట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. 18 శాతం కేంద్రం నిధులతో.. మెట్రోరైలు ప్రాజెక్టులను వేర్వేరు నగరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యాలతో నిర్మిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం భరించే వాటా సాధారణంగా 15 శాతం ఉంటుంది. హైదరాబాద్ మెట్రో రెండోదశలో 18 శాతం వరకు ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్రం తన వాటాగా 30 శాతం భరించేందుకు సిద్ధపడుతుంది. 4 శాతం పీపీపీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలనేది ఆలోచన. మిగిలిన 48 శాతానికి

సంబంధించి జైకా వంటి సంస్థల నుంచి

తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుంటారు. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య ప్రాజెక్టుపై రుణాలకు కేంద్రం పూచీకత్తు ఇస్తుందని అధికారులు అంటున్నారు.



# ఎల్బీ స్టేడియంలో మెగా డిఎస్సీ వేడుక

**హైదరాబాద్:** ఎల్బీ స్టేడియంలో బుధవారం డీఎస్సీ కొలువుల పండగ జరగనుంది. డిఎస్సీ అర్థ పొందిన వారికి సీఎం రేవంత్ రెడ్డి నియాక పత్రాలు అందచేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకి డీఎస్సీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఈ కారణంగా.. ఎల్బీ స్టేడియం వైపుగా వచ్చే వారికి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వచ్చే ట్రాఫిక్‌ని ఏఆర్ వద్ద డైవర్ట్ చేసి నాంపల్లి రైల్వే స్టేషన్ వైపు మళ్ళించనున్నారు. బషీర్‌బాగ్ నుంచి ఏఆర్ జంక్షన్ వైపు వచ్చే ట్రాఫిక్‌ని పెట్రోల్ బంక్, బీజేఆర్ విగ్రహం వద్ద , అబిడ్స్, నాంపల్లి స్టేషన్ రోడ్డు వైపు డైవర్ట్ చేయనున్నారు. రవీంద్ర భారతి నుంచి బీజేఆర్ విగ్రహం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఏఆర్ వద్ద మళ్లించనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ వెల్లడించింది. ఎల్బీ స్టేడియం వైపు వెళ్లే నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 12న దసరా పండుగ కావడంతో హైదరాబాద్ నుంచి సద్దుల బతుకమ్మ, దసరా పండుగులకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్‌ఆర్టీసీ కూడా అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 6304 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఎల్బీనగర్ ఆరాంఘర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, బోయిన్ పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్ సదన్, బోరబండ, శంషాబాద్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది.





2లో

**యూ ట్యూబర్‌పై కేసు..**
**కెటిఆర్ ఆగ్రహం**



**అట్టహాసంగా జాతీయచలన చిత్ర అవార్డులు**

రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న చిత్ర ప్రముఖులు

2లో..



2లో..

**ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో వివక్ష**

ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలకు అన్యాయం

జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు ఆందోళన

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

## సుప్రీం తీర్పుకు విరుద్ధంగా నియామకాలు

ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండా డిఎస్సీ

సిఎం రేవంత్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదు

నేడు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలకు మందకృష్ణ పిలుపు



2లో..



2లో..

## 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

భారీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

ఫైర్ వర్క్స్, లేజర్‌షోలతో ఆకట్టుకునేలా ఏర్పాట్లు

అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

# కొండా సురేఖను చట్టప్రకారం శిక్షించండి

### న్యాయపరంగా ముందుకెళ్తాం..

**-తిరుపతివర్మ, మంత్రి కొండా సురేఖ తరఫు న్యాయవాది**

సినీనటుడు నాగార్జున మంత్రిపై దాఖలు చేసిన పిటిషన్ నిలబడదని భావిస్తున్నా. ఆయన పిటిషన్‌లో ఒకటి చెప్పి, వాంగ్మూలంలో మరొకటి చెప్పారు. న్యాయస్థానం సాక్షులను పరిగణనలోకి తీసుకుని.. మంత్రికి నోటీసులు జారీ చేసే పక్షంలో న్యాయపరంగానే ముందుకెళ్తాం. మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో కొందరు పెడుతున్న పోస్టులపై బుధవారం డీజీపీకి ఫిర్యాదు చేస్తాం.

హైదరాబాద్: తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాజకీయ దురుద్దేశంతో వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సినీ నటుడు అక్కినేని నాగార్జున నాంపల్లి ప్రత్యేక కోర్టును కోరారు. కొండా సురేఖపై దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో మంగళవారం ఆయన న్యాయస్థానం ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ఆయనతో పాటు భార్య అమల, కుమారుడు నాగ చైతన్య ఉన్నారు.సంచలనాల కోసమే...“తెలుగు సినీ చరిత్రలో నా తండ్రి అక్కినేని నాగేశ్వరరావుకు పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కుటుంబ పరువు, ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసేలా నేను, నా భార్య అమల, కుమారుడు నాగ చైతన్య నడుచుకుంటున్నాం. నాగ చైతన్య, సమంతలకు 2017లో వివాహం కాగా, వ్యక్తిగత విభేదాలతో 2021లో విడాకులు తీసుకున్నారు. నాగ చైతన్య, సమంత విడాకుల అంశం.. మాజీ మంత్రి కేటీఆర్‌తో ముడిపడి ఉందంటూ తాజాగా మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. 'ఎన్‌కన్వెన్షన్ విషయంలో సమంతకు సంబంధించి అసభ్యకరమైన ప్రతిపాదనను కేటీఆర్ నా ముందు ఉంచినట్టు, దానికి నేను మద్దతు ఇచ్చినట్టు' మంత్రి హోదాలో ఆమె చేసిన వ్యాఖ్యలు నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా బాధించాయి. నా వ్యక్తిగత, వృత్తిపరమైన, కుటుంబ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. నిరాధార ఆరోపణలు టీవీ, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో ప్రజల్లోకి తప్పుడు



సంకేతాలు వెళ్లాయి. దురుద్దేశ రాజకీయ లబ్ధి, సంచలనాల కోసమే ఆమె ఆ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నాం. ఆ వ్యాఖ్యల అనంతరం కుటుంబసభ్యులు, సహోద్యోగులు, ఇతరుల నుంచి నాకు అనేక ఫోన్‌కాల్స్ వచ్చాయి. వారంతా ఆందోళన చెంది నన్ను సంప్రదించారు. ఇందులో యార్లగడ్డ సుప్రియ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ క్రమంలోనే మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ 'ఎక్స్' ద్వారా బహిరంగ ప్రకటన చేయాల్సి వచ్చింది.

# తప్పిన ఎగ్జిట్ పోల్ అంచనాలు





**న్యూఢిల్లీ:** హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగుతున్న హరియాణా పోరులో భాజపా హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. తొలుత కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా.. అనూహ్యంగా కమలం పుంజుకుని ఆధిక్యాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా వెళ్తోంది. అటు జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్ కూటమికి ఓటర్లు స్పష్టమైన మెజార్టీ ఇచ్చినట్లే కన్పిస్తోంది.
ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని సర్వే సంస్థలు హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ప్రస్తుతం ఫలితాల సరళి చూస్తే మాత్రం హర్యానా ప్రజలు మరోసారి బీజేపీని ఆదరించి నట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ కాంగ్రెస్ చేసిన తప్పిదాలే ఆ పార్టీ మెజార్టీ మార్క్ సాధించక పోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు. హర్యానా ఎన్నికల్లో అందరినీ దృష్టిని ఆకర్షించిన రెజ్లర్ వినేశ్ ఫోగట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జులానా నుంచి పోటీచేసి గెలుపొందారు. హరియాణాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 46 స్థానాలు అవసరం. ప్రస్తుతం ఇక్కడ భాజపా ఆధిక్యం, గెలుపు కలిపి 47 స్థానాల్లో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ 37 స్థానాలకు పరిమితమైంది. ఐఎన్‌ఎల్‌డీ 2, ఇతరులు 4 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా తెరవకపోవడం గమనార్హం. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. ఇక్కడ బీజేపీ స్పష్టమైన ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్‌ను దాటి అత్యధిక స్థానాల్లో ముందంజలో ఉంది.హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు గానూ కమలం పార్టీ 51 స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. దీంతో బీజేపీ శ్రేణులు సంబరాలు షురూ చేశారు. పార్టీ అత్యధిక స్థానాల్లో లీడింగ్‌లో ఉండటంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు మొదలు పెట్టారు. అంబాలో పార్టీ జెండాలను చేతపట్టుకుని డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. కొన్ని చోట్ల బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు టీ 20 మ్యాచ్‌ను తలపించాయి. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో దూసుకెళ్లిన కాంగ్రెస్ ఒక్కసారిగా పడిపోయింది. ఈవీఎంలు లెక్కింపు తర్వాత వైకుంఠపాళీ ఆటలో మాదిరిగా కాంగ్రెస్ ఒక్కో సీటు తగ్గుతూ వచ్చింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదట్లో కాంగ్రెస్ దూసుకెళ్లింది. దాదాపు అరవైకిపైగా స్థానాల్లో ఆధిక్యం చూపించింది. ఈ దెబ్బకు బీజేపీకి 20 స్థాలైనా వస్తాయా అన్న అనుమానం కలిగింది.

## 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

**హైదరాబాద్:** హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై దాదాపు పదివేల మంది మహిళలతో ఈనెల 10 వతేదీన సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియచేశారు. 10వ తేదీన నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్. మాట్లాడుతూ, 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ లనుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

## హ్యాట్రిక్ విజయం సాధించిన బిజెపి

**చండీఘర్**: హర్యానాలో ముచ్చటగా మూడోసారి బీజేపీ విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ ఎవరు ఊహించని విధంగా కాషాయ పార్టీ హ్యాట్రిక్ కొట్టింది. హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 సీట్ల విజయ ఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 46 సీట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. తద్వారా మరోసారి హర్యానా గడ్డపై బీజేపీ జెండా రెపరెపలాడనుంది. కాగా, ఎన్నికల కౌంటింగ్ మొదట్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా బీజేపీ వెనుకంజలో ఉండగా.. కాంగ్రెస్ భారీ అధిక్యం సాధించింది. దీంతో ఎగ్జిట్ పోల్స్ అంచనాల మేరకు కాంగ్రెస్ పార్టీ హర్యానాలో విజయం సాధించడం ఖాయమని అంతా ఫిక్స్ అయారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద హస్తం పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చుతూ, సీట్లు పంపుకుంటూ ఏకంగా సంబురాలు చేసుకున్నారు. కానీ ఆ ఆనందం కాంగ్రెస్ కార్యకర్తలకు ఎంతో సేపు నిలువలేదు. మూడు, నాలుగు రౌండ్ల కౌంటింగ్ నుండి బీజేపీ తన సత్తా చాటింది. వరుస రౌండ్లలో అధిక్యం సాధిస్తూ జెడ్ దూసుకొచ్చింది. అప్పటి వరకు మొదటి స్థానంలో కొనసాగిన కాంగ్రెస్ బీజేపీ దెబ్బకు రెండో స్థానానికి పరిమితం అయ్యింది. అక్కడ నుండి ఇక కాంగ్రెస్ పార్టీ బీజేపీని బీట్ చేయలేక సెకండ్ ప్లేస్?లోనే నిలిచిపోయింది. 37 స్థానాలకే పరిమితమై మరోసారి అధికారానికి కాంగ్రెస్ దూరమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్‌కు (46 స్థానాలు) 9 సీట్ల దూరంలో ఆగిపోయిన కాంగ్రెస్.. హర్యానాలో మరోసారి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా బరిలోకి దిగిన ఆప్ ఘోర పరాజయం పాలైంది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో ఓటమి పాలై.. కనీసం ఖాతా కూడా తెరవలేదు. లోక్ సభ ఎన్నికల తర్వాత దేశంలో రెండు రాష్ట్రాల్లో జమ్మూ కాశ్మీర్, హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల్లో జరగగా.. హర్యానాలో అధికారం నిలబెట్టుకున్న బీజేపీ.. జమ్మూ కాశ్మీర్ లోనూ గతానికంటే మెరుగైన ఫలితాలు రాబట్టింది.

## లోక్‌సభ ఎనికల పరాభవంతో అప్రమత్తం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన షాక్ నుంచి హరియాణాలో భాజపా వేగంగా పుంజుకొంది. సామాజిక ఇంజినీరింగ్ నుంచి ఎన్నికల వ్యూహాల వరకు అన్నింటికి పదును పెట్టింది. మోదీ-షా ద్వయం అన్నీ తామై రాష్ట్రంలో పార్టీని నడిపించారు. ఫలితంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తల్లకిందులు చేస్తూ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో హరియాణాలో సీట్లు తగ్గడంతో భాజపా అప్రమత్తమైంది. దీనిని ఉపేక్షిస్తే.. రాష్ట్రం చేజారే ప్రమాదం ఉందని భావించింది.
అభ్యర్థుల ఎంపిక నుంచి కుల సమీకరణల వరకు కసరత్తు చేసింది. ముఖ్యంగా జాతీయ స్థాయి నేతలతోకాకుండా.. రాష్ట్ర స్థాయిలోనే భాజపా ఈ పోరాటం చేయడం విశేషం. ప్రీపోల్స్, పోస్ట్ పోల్ సర్వేలు ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉందని కోడై కూసినా.. ప్రజలు మాత్రం కమలదళానికే పట్టం కట్టారు.
భాజపా సోషల్ ఇంజినీరింగ్ కూడా బలంగానే పనిచేసిందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో జాట్ వర్గం కాంగ్రెస్ ఛత్రం కింద ఏకమవుతోందని భాజపా గ్రహించింది. దీనికి రెజ్లర్ల ఆందోళన కూడా తోడవడంతో బలమైన ఓబీసీ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు నాయబ్‌సింగ్ సైనీకి అధికార పగ్గాలు అందించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అన్న పోరాటంలో పైచేయి సాధించింది. దీనికి తోడు దళితుల్లో బలమైన జాటవ్‌లు కాంగ్రెస్ పక్షం వహించగా.. వారిలో మిగిలిన కులాలు భాజపా వైపు మళ్లాయి. అగ్రకులాలు, పంజాబీలపై భాజపా ఎక్కువగా ఆధారపడింది. ఈక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో నష్టంతో వెంటనే తేరుకొని.. పార్టీ రాష్ట్ర పగ్గాలను బ్రాహ్మణవర్గానికి చెందిన మోహన్‌లాల్ బదోలికి అప్పగించింది. రాష్ట్రంలో ఈ వర్గం ఓట్లు 7.5శాతం ఉంటాయి. 11 సీట్లను ఈ వర్గానికి కేటాయించింది. సాధారణంగా రాష్ట్రంలోని అగ్రకులాలు, పంజాబీల్లో ఎక్కువ కుటుంబాలు దేశ విభజన తర్వాత వలసవచ్చి స్థిరపడ్డవే. వీరు గ్రాండ్ ట్రంక్‌రోడ్ మార్గంలోని అర్బన్ నియోజకవర్గాల్లో అధికంగా ఉంటారు. 2014, 2019 ఎన్నికల్లో వీరే భాజపాకు మద్దతుగా నిలిచారు. మరోవైపు కాంగ్రెస్ జాట్-దళిత్ కూటమి ఏర్పాటుచేసింది. భాజపా యాంటీ జాట్ కూటమితో హస్తం పార్టీ దూకుడు తగ్గించాల్సి వచ్చింది. ముఖ్యంగా జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవచ్చనే ఆందోళన చెందింది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో జేజేపీ హఠాత్తుగా మద్దతు ఉపసంహరించిన సమయంలో పార్టీ అధికారం చేజారకుండా కాపాడుకోగలగడం ఎన్నికల్లో కలిసొచ్చింది. మహిళలు కేంద్రంగా భాజపా ఎన్నికల ప్రచారం సాగింది. ఫలితంగా అతివల్లో ఆ పార్టీపై కొంత సానుకూలత ఉంది. రైతు ఆందోళన వల్ల వచ్చిన ప్రతికూల ఇమేజీ నుంచి బయటపడటానికి ఈ ఏడాది ఆగస్టులో 24 పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించింది. ఓ రకంగా ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించిందనే చెప్పాలి. ఈసారి నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి 10 ఇండస్ట్రియల్ కారిడార్లను రాష్ట్రానికి తీసుకొస్తామన్న హామీ యువతపై పనిచేసింది. వీటిద్వారా 50,000 ఉద్యోగాలు ఇస్తామని పార్టీ పేర్కొంది. అగ్నివీర్‌ల అంశం రాష్ట్రంలో కమలం పార్టీని చాలాకాలం ఇబ్బందిపెట్టింది. దీనికి చెక్‌పెడుతూ.. వారికి 10శాతం రిజర్వేషన్లు ఇస్తామనడంతోపాటు.. బ్యాంకు రుణాల మంజూరు సరళతరం చేస్తామన్న హామీ పని చేసింది. నీరజ్ స్వర్ణపతకం సాధించిన తర్వాత ఆ రాష్ట్రంలో స్పోర్ట్స్ కల్చర్‌ను భాజపా సర్కారు బాగా ప్రోత్సహించిందన్న పేరు కూడా యువతలో మంచి ఇమేజీని తీసుకొచ్చింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం టాప్స్ వంటి అంశాలు కలిసొచ్చాయి. తాజాగా తాము తిరిగి ప్రభుత్వంలోకి వస్తే 'ఒలింపిక్ నర్సరీ'లను ఏర్పాటుచేస్తామని ఆ పార్టీ పేర్కొంది. అసలే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవినీతి తీవ్రంగా ఉందని యువత మథనపడుతుంటే.. ప్రతీ 50 ఓట్లకు ఓ ఉద్యోగాన్ని ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు కొందరు ప్రచారం చేశారు. సిఫార్సుల ఆధారంగా కొలువులంటూ చేసిన ప్రచారం ప్రతిభావంతులైన యువతను భయపెట్టింది. దీనిని భాజపా బలంగా ఓట్ల రూపంలో మలుచుకొంది. మేవాత్‌లో కొంతకాలం క్రితం జరిగిన అల్లర్లతో కొన్ని వర్గాల ఓటర్లు భాజపాకు అనుకూలంగా మారారు. ఎన్నికల్లో భారీ ఎత్తున పాల్గొని ఓటు వేయడం కమలానికి కలసివచ్చింది.
మోదీ ఈ సారి హరియాణాలో ఎన్నికల్లో ర్యాలీలను గణనీయంగా తగ్గించుకొని కేవలం నాలుగుకే పరిమితం చేశారు. ఈ ఎన్నికలను రాష్ట్రస్థాయిలోనే పోరాడేట్లు భాజపా హైకమాండ్ వ్యూహ రచన చేసింది. ప్రభుత్వ వ్యతిరేకతకు కళ్లెం వేసేలా.. ముఖ్యమంత్రి ఖట్టర్‌ను మార్చేసిన భాజపా దాదాపు సగంమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లను నిరాకరించింది. దీంతో ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులపై ఉన్న బలమైన వ్యతిరేకతకు చెక్ పెట్టినట్లైంది. మొత్తం 60 మంది కొత్తవారికి అవకాశాలు ఇచ్చింది. మంజూ హుడా, యోగేషన్ బైరాగి, కృష్ణకుమార్, ఆర్తిసింగ్ రావ్ వంటి వారున్నారు. భాజపాకు అహిర్వాల్ బెల్ట్ ఈసారి కూడా బలమైన అండగా నిలిచింది. గురుగ్రామ్, రేవరి, మహేంద్రఘడ్ ప్రాంతాలు దీనిలోకి వస్తాయి. ఈ బెల్ట్‌లోని 28 అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా అర్బన్ ఓటర్లు ఉన్నారు. వారు కమలం పక్షం వహించడం కలిసొచ్చే అంశం. 2019లో హరియాణాలో మిగిలిన ప్రాంతాల్లో సీట్లు తగ్గినా.. ఈ ప్రాంతం మాత్రం గతం కంటే ఒకటి ఎక్కువే భాజపాకు అందించింది. లోక్‌సభ ఎన్నికల్లో గురుగ్రామ్, రోహ్‌తక్, భివానీ-మహేంద్రఘడ్‌లోని 11అసెంబ్లీ సెగ్మెంట్లలో 10 కమలం పక్షమే వహించాయి.

## యూ ట్యూబర్‌పై కేసు..కెటిఆర్ ఆగ్రహం



**హైదరాబాద్:** యూ ట్యూబర్, జర్నలిస్టు గౌతమ్ గౌడ్ కేసు నమోదు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఓ రైతు ఆవేదనను గౌడ్ యూట్యూబ్‌లో పెట్టారని, అంతమాత్రానికే కేసు పెడతారా అని, ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు ఈ వీడియోలో తప్పేముంది..? జర్నలిస్టు గౌతమ్ గౌడ్‌పై కేసు ఎందుకు నమోదు చేశారు..? అని తెలంగాణ డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. నేను కూడా ముషంపల్లిలో రైతు మల్లయ్యను కలిశాను. అతనితో మాట్లాడాను. మరి నాపై కేసు పెడుతారా..? అని డీజీపీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.నల్లగొండ జిల్లాలోని ముషంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు.. కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సాగునీరు వచ్చింది. 24 గంటల నాణ్యమైన కరెంట్ అందింది. ఏడాదికి రెండుసార్లు రైతుబంధు జమ చేశారు. కానీ రేవంత్ పాలనలో రైతుబంధు రాక అప్పులపాలవుతున్నామని, మళ్లీ కేసీఆరే రావాలి.. నాతో పాటు మరో పది మందితో కేసీఆర్‌కు ఓట్లు వేయిస్తామని రైతు మల్లయ్య ఆవేదనతో మాట్లాడారు. రైతు మల్లయ్య మాట్లాడిన వీడియోను జర్నలిస్టు గౌతమ్ గౌడ్ యూట్యూబ్‌లో పోస్టు చేశారు.

## ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిన కాశ్మీర్



**శ్రీనగర్:**కశ్మీరీ ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికే పట్టం కట్టారు. ఉగ్రవాదం, వేర్పాటువాద ఉద్యమాలతో సతమతమవుతున్న జమ్మూకశ్మీర్ లో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తోంది. 370 ఆర్టకల్ రద్దు తరవాత చేపట్టిన చర్యలు అక్కడ సాధారణ స్థితికి తీసుకుని వచ్చాయి. ఒకప్పుడు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన ప్రజలే.. తాజా ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరడం, ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తీరు మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నాలు చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ పలు కీలక నిర్ణయాలతో ముందుకెళ్లారు. మరోవైపు ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యంగా భారత సైన్యం అనేక ఆపరేషన్లను చేపట్టింది. అంతేకాకుండా అక్కడ ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పే జమాతే ఇస్లాం వంటి వేర్పాటువాద సంస్థలు కూడా తమ గళాన్ని మార్చినట్లు కనిపిస్తోంది. తమకు తుపాకులు, రాళ్లలో విశ్వాసం లేదని భావించిన స్థానికులు ప్రజాస్వామ్యం వైపే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీని నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ జమ్మూ కశ్మీర్ అభివృద్ధి నినాదమే తమ అజెండా అని కాషాయ పార్టీ ముందుకెళ్లింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది.

## అట్టహాసంగా జాతీయచలన చిత్ర అవార్డులు

**న్యూఢిల్లీ:**భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 70వ నేషనల్ సినీ అవార్డ్స్ ప్రదానోత్సవం.. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతోంది. రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ.. విజేతలకు అవార్డులని అందించారు. ఈ వేడుకకు దాదాపు అన్ని సినీ ఇండస్ట్రీకి చెందిన నటీనటులు, ప్రముఖులు హాజరయ్యారు. తెలుగు నుంచి 'కార్తికేయ 2'కి ఉత్తమ ప్రాంతీయ చిత్ర కేటగిరీలో పురస్కారం దక్కింది. దర్శకుడు చందు మొండేటి దీన్ని అందుకున్నారు. 'తిరు' చిత్రానికి ఉత్తమ నటిగా నిత్యా మీనన్, 'కాంతార' మూవీకి గానూ ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి అవార్డులు అందుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు మిథున్ చక్రవర్తికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ ప్రదానం చేశారు. టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కి అవార్డ్ ఇవ్వాలి. కానీ లైంగిక ఆరోపణల కేసు కారణంగా దీన్ని రద్దు చేశారు. 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలు అట్టహాసంగా సాగింది. ఇందులోభాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో చలన చిత్ర పరిశ్రమలో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు ప్రధానం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగులో స్టార్ హీరో నిఖిల్ హీరోగా నటించిన కార్తికేయ 2 చిత్రానికి బెస్ట్ తెలుగు ఫిల్మ్ విభాగంలో జాతీయ అవార్డు దక్కింది. కాగా ఈ చిత్రానికి టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ చందు మొండేటి దర్శకత్వం వహించగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించింది. మిస్టరీ, యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులను బాగానే
ఆకట్టుకుంది. ఇక కన్నడలో రిషబ్ శెట్టి నటించిన కాంతార చిత్రానికి కూడా రెండు అవార్డులు లభించాయి. ఇందులో ఉత్తమ నటుడి విభాగంలో రిషబ్ శెట్టి, బెస్ట్ పాపులర్ సినిమా విభాగంలో కాంతార చిత్రానికి నేషనల్ అవార్డులు లభించాయి. ఈ చిత్రం పాన్ ఇండియా భాషలలో విడుదల చెయ్యగా పెద్ద హిట్ అయ్యింది. ఈ క్రమంలో దాదాపుగా రూ.450 కోట్లు(గ్రాస్) వసూళ్లు సాధించింది. రిషబ్ శెట్టి మాట్లాడుతూ కాంతారా చిత్రానికి రెండు అవార్డులు రావడంతో ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే రీజినల్ చిత్రాలని అవార్డులతో ప్రోత్సహిస్తే ఎంతోమంది దర్శకనిర్మాతలు సినిమాలు చెయ్యడానికి ముందుకు వస్తారని అన్నారు.

## సుప్రీం తీర్పుకు విరుద్ధంగా నియామకాలు

**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసనలకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మందకృష్ణ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి, ధర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టర్రేట్ల వరకు ర్యాలీలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలి. హైదరాబాద్ నగరంలో
ట్యాంక్ బండ్ నుంచి బషీర్‌బాగ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మందకృష్ణ మాదిగ తెలిపారు.
రేవంత్ సర్కార్ తమకు నమ్మక ద్రోహం చేసిందని మందకృష్ణ ధ్వజమెత్తారు. మాదిగలకు సీట్లు తగ్గడానికి కూడా రేవంత్ రెడ్డినే కారణం అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. అసెంబ్లీలో ప్రకటించిన మాదిరిగా.. రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి బషీర్ బాగ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. వివేక్, వినోద్ ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా.. వంశికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. పార్టీ మారి వచ్చిన వివేక్ కుటుంబంలో రెండు సీట్లు ఇచ్చారన్నారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో వివక్ష




**హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్యగోచరంగా మార్చింది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల జరుగుతున్న ఇబ్బందులను హరీశ్‌రావుకు తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజేస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం మూలంగా.. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. దీని వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు.
విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 19 వేల కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేయడం జరిగింది. ప్రతి ఏడాది సగటున క్రమం తప్పకుండా రెండు వేల కోట్లు విడుదల చేసిందని, కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికి కేవలం విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్య పట్ల తమకున్న ప్రాధాన్యాన్ని చాటి చెబుతుందని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేక పోతున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. సిబ్బంది నుండి తమపై విపరీతమైన ఒత్తిడి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల అ÷-దదెలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు వడ్డీలు కట్టలేక, కొత్త అప్పులు దొరక్క కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని నిలదీస్తాం..ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రాజస్థాన్‌లో ఎపి లాయర్ల బస్సుకు ప్రమాదం

సిఎం బజన్‌లాల్ శర్మతో మాట్లాడిన సిఎం చంద్రబాబు

**అమరావతి:**రాజస్థాన్ ముఖ్యమంత్రి బజన్ లాల్ శర్మతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాట్లాడారు. విజయవాడ నుంచి వెళ్లిన న్యాయవాదుల బృందం బస్సు రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రమాద ఘటనపై ఆ రాష్ట్ర సీఎంతో చంద్రబాబు మాట్లాడారు. బాధితులకు అవసరమైన సాయం అందిచాలని సీఎం కోరారు. ప్రమాదంలో విజయవాడకు చెందిన ప్రముఖ అడ్వకేట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి జోత్స్న మృతి చెందగా.. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై రాజస్థాన్ సీఎంతో మాట్లాడి ప్రమాద బాధితులకు మెరుగైన సాయం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. అడ్వకేట్లు తిరిగి ఇంటికి రావడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. రాజస్థాన్‌లో విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్న ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు.
ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న మృతిచెందడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మహిళలు, విద్యార్థినులను చైతన్యం పరిచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించిన జ్యోత్స్న మృతి బాధాకరమన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించిన సీఎం... వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బస్సు ప్రమాదానికి గల కారణాలపై అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అవసరమైన సాయం అందించాలని తన కార్యాలయ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అలాగే విజయవాడ బారు అసోసియేషన్ సభ్యుల రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. మహిళా భద్రత, సాధికారత కోసం ఉద్యమించిన ప్రముఖ సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి గొల్లపల్లి జ్యోత్స్న రాజస్థాన్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలచివేసింది. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. విహారయాత్ర విషాదయాత్రగా మారడం బాధాకరం. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేంద్ర ప్రసాద్ గారు, న్యాయవాదులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ నిర్వహించిన టూర్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్ళే మార్గంలో వీరు ప్రయాణించిన బస్సుకు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రముఖ న్యాయవాది, అఖిల భారత లాయర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే సుంకర రాజేంద్ర ప్రసాద్‌తో పాటు మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి.






# కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.

### సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా.

### కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష, పాల్గొన్న కలెక్టర్, సీ.పీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 08 :**

అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి ఎనలేని ప్రాధ్యాన్యత ఇవ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన ఆయా శాఖల జిల్లా అధికారులతో సమావేశమై పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి కమిషన్ సభ్యులు పి.పి.వావా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు, 530 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికులు ఇంటింటి చెత్తను సేకరించి, వాహనాల ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారని వివరించారు. కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు వారి పిల్లలకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన



విద్యను అందిస్తున్నామని, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్య కోసం రూ.20 లక్షల వరకు ఆర్థిక చేయూతను ప్రభుత్వం తరపున సమకూరుస్తున్నామని తెలిపారు. కాగా, సఫాయి కర్మచారీలకు సంబంధించి జిల్లాలో గత 15 సంవత్సరాల కాలం నుండి ఎలాంటి అట్రాసిటీ కేసులు నమోదు కాలేదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ కమిషన్ సభ్యుని దృష్టికి తెచ్చారు. 2010 లో చివరి అట్రాసిటీ కేసు నమోదు అయ్యిందని, ఇద్దరు బాధితులకు నష్టపరిహారం సైతం ఇప్పించడం జరిగిందని తెలిపారు.

ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు పి.పి.వావా మాట్లాడుతూ, మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలన్నారు. వారి పూనావాసానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని, బీమా సౌకర్యం, పీ.ఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు అమలు చేస్తున్న కార్యక్రమాలను, సేఫ్టీ కిట్లను పరిశీలించారు. కమిషన్ సభ్యుని వెంట కేంద్ర సామాజిక న్యాయ విభాగం సభ్యులు గిరేందర్ నాథ్, కోఆర్డినేటర్ చరణ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# ఎరక్కపోయి వచ్చాం.. ఇరుక్కుపోయాం!

పనులు కావు..
పలుకుబడి లేదు
రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి
ఫిరాయింపు ఎమ్మెల్యేల అంతర్మథనం
పట్టించుకునేవారే లేరని ఆవేదన
గాంధీ భవన్‌కు పోలేరు..
సీఎంను కలవలేరు
ముఖం చాటేస్తున్న ప్రభుత్వ పెద్ద
రాగానే పిలవద్దని వ్యక్తిగత నీడకు హుకుం
ప్రజల్లో నవ్వులపాలయ్యామని ఓ ఎమ్మెల్యే మనస్తాపం!
ఇల్లిల్లూ తిరిగి కండువా కప్పి..
ఇప్పుడు కలవకపోవడంపై ఆ పది మంది గుర్రు!

హైదరాబాద్:అధికార పక్షాన ఉంటే.. అనుకున్నది సా ధించుకోవచ్చు' అని ఆశపడి గోడ దుంకిన ఎ మ్మెల్యేలకు ఆశాభంగమే అయిందా? అటు ప నులు చేసుకోలేక.. ఇటు పరువు నిలబెట్టుకోలే క తమ నియోజకవర్గాల్లో ఆ పది మంది తిరగలేకపోతున్నారా? అంటే.. 'అవును' అన్నదే సమాధానం! 'ఇది గ్యారెంటీగా మోసమే.. ప్ర జలకు ఇచ్చిన హామీల సంగతేమోగానీ మాకు ఇచ్చిన మాటయితే నిలబెట్టుకుంటరనుకు న్నం. అదీ లేదు.. ఇదీ లేదు.. రెంటికీ చెడ్డరేవడిలా మా పరిస్థితి తయారైంది' అని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ సీనియర్ ఎమ్మె ల్యే వాపోవడం వారి పరిస్థితిని బయటపెడుతున్నది.ఇలా ఒకరిద్దరు కాదు.. పార్టీ మారిన 10 మంది, ఆరుగురు ఎమ్మెల్సీలదీ అదే దు స్థితి అని తెలుస్తున్నది. 'కండువా మారేదాకా వెంటపడ్డరు.. ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకున్నపాపాన పోవటంలేదు' అని వాపోతున్నా రు. పార్టీలో చేరిన సమయంలో ఇచ్చిన హామీ ల్లో ఒకరిద్దరికి హామీని నిలబెట్టుకున్నా, మిగతా వారికి మొండిచెయ్యే చూపారు. అందరికీ 'అజ్ఞాతబంధువు' ఆశీస్సులు ఉండవు కదా? అని వారే నిట్టూరుస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం అటుంచితే.. కనీసం తమను కలిసేందుకు కూడా ముఖం చాటేస్తున్నారని, పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు ప డితే అప్పుడు రానియ్యొద్దని చెప్పిన కదా.. మ ళ్లీ ఎందుకు రానిస్తున్నరు' అని ప్రభుత్వ పెద్ద తన వ్యక్తిగత నీడకు హుకుం జారీ చేశారని చెప్తున్నారు.అందరిదీ అదే వరుస..ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూ డి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి ఈ 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అ యితే, బీఆర్ఎస్‌ను జీరో చేస్తామని, అసలు ఆ పార్టీ అంటూ ఉండదని, ఆ పార్టీలో ఉండి చేసేదేమీ లేదని కాంగ్రెస్‌లో చేరండి అని కాంగ్రెస్ పెద్దలు ఇల్లిల్లూ తిరిగి ఆహ్వానాలు పలికారు.స్వయంగా వీరందరినీ సీఎం రేవంత్‌రెడ్డి కాం గ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ చేరుతున్నవారికి ఎదురులేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరి స్థాయిని బట్టి వారి కమిట్‌మెంట్‌కు అనువైన అవకాశం కల్పిస్తానని వాగ్దానం చేసి, కండువా మారిన తెల్లా రి నుంచే తమను పట్టించుకోవటం మానేశారని వారు వాపోతున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరే సమయంలో క్యాబినెట్ మం త్రి హోదాతోపాటు, అన్ని రకాలుగా 'రోజువారీ' రాయబారాలకు ఇబ్బంది లేకుండా చే స్తామని హామీ ఇచ్చారని, తీరా అమలు విషయానికి వచ్చేసరికి మొదట్లో సూపర్‌హిట్ సినిమాను తలపించినా తర్వాత బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డట్టయిందని ఆయన గుర్రుగా ఉన్నట్టు స న్నిహితులే చెప్తున్నారు.ఇక ఇచ్చిన పదవి విషయంలోనూ 'పండ్లులేని నోటికి వెలగపండు ఇచ్చి కొరుక్కుతినుమన్నట్టే ఉంది' అని ఆయన మథనపడుతున్నట్టు తెలిసింది. చేరిక ఒప్పందంలో కీలక హామీ.. బకాయిలానే ఉన్నదని, ప్రజల ముందు బకరా అయినట్టు పరిస్థితి ఉన్నదని తన సన్నిహితులతో ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే ఆవేదన వెల్లగక్కినట్టు తెలిసింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, దా నం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి పరిస్థితి కూడా అధ్వానంగా తయారైందని అం టున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల అంశం ఓ వైపు ఇబ్బందిగా మారితే మరోపైపు తమకు సీఎం రేవంత్‌రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని మథనపడుతున్నారు. పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు పడితే అ ప్పుడు రానివ్వద్దు' అని వీరిలో ముగ్గురిని ఉద్దేశించి వారికి వినపడే లానే పేర్కొనటంతో కం గుతినటం ఆ ఎమ్మెల్యేల వంతు అయిందట! అటు నియోజకవర్గంలో, ఇటు పార్టీలో తమ కు ఎలాంటి ప్రాధాన్యత లేక, తాము చేరిన ప్రయోజనం నెరవేరుతుందన్న నమ్మకం లేక పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రజల్లో కనిపించ టం లేదని అంటున్నారు.

## జమ్మూ ప్రాంతంలో భాజపా విజయం చరిత్రాత్మకం

న్యూఢిల్లీ: హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించారు. జమ్మూ ప్రాంతంలో భాజపా విజయం చరిత్రాత్మకమైనదని.. గతంలో కన్నా ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. జమ్మూ ప్రజలు తమవెంటే ఉన్నారని మరోసారి నిరూపితమైందన్నారు. కాంగ్రెస్ విముక్త జమ్మూకశ్మీర్ సాధనలో విజయం సాధించామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ అగ్రనేతల మార్గదర్శనంలో జమ్మూకశ్మీర్‌లో నేతలంతా ఐక్యంగా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. ఇకపై జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి మరింత కష్టపడి పనిచేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఆత్మవిశ్వాసాన్ని తగ్గించామంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. మోదీపై ప్రజలకున్న విశ్వాసమేంటో.. జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల ఫలితాలే స్పష్టం చేశాయి. ప్రజలు చూపించిన విశ్వాసంతోనే.. జమ్మూ ప్రాంతంలోని 43 అసెంబ్లీ స్థానాల్లో భాజపా 29 స్థానాలు గెలుచుకుందన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కేవలం ఒక్క సీటు మాత్రమే గెలిచిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హరియాణాలో మూడోసారి భాజపా అద్భుతమైన విజయం సాధించడం పట్ల కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఇదో థ్రిల్‌లాఉందన్నారు. హరియాణాలో కాంగ్రెస్ ఓటమితో వారి మోసపూరిత వ్యూహం బెడిసికొట్టిందన్నారు. తెలంగాణ, కర్ణాటకలో తప్పుడు వాగ్దానాలతో ఓటర్లను తారుమారు చేయగలిగారు గానీ వారు ప్రతి చోటా ప్రజలను మోసం చేయలేరని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత ఆవిరైపోయే కాంగ్రెస్ అబద్ధాలు, ప్రచారం, విభజన వ్యూహాలు, వాగ్దానాలకు ఓటర్లు పడబోరని గుర్తు చేశారు. కాంగ్రెస్ మోసపూరిత ఆట ముగిసిందని ఇప్పటికైనా తెలంగాణ, కర్ణాటకలో మేల్కొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు. హరియాణాలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు ప్రధాని మోదీపై విశ్వాసం ఉంచారన్నారు. ఈ సందర్భంగా హరియాణా సీఎం, ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

# మహిళల ఐక్యతకు నిదర్శనం "బతుకమ్మ"

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.











**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 8:**

తెలంగాణ మహిళలకు బతుకమ్మ గొప్ప పండుగ అని, మహిళల ఐక్యతకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం ఐ.డి.ఒ.సి. లో జనహిత వారి సౌజన్యంతో తెలంగాణ జెఎసి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగిస్తూ, మహిళా ఉద్యోగుల కోసం బతుకమ్మ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులను అభినందించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ లో సంప్రదాయంగా బతుకమ్మ పండు గలను మహిళలు నిర్వహించు కుంటారని తెలిపారు. మొదటి మూడు ఉత్తమ బతుకమ్మ లకు బహుమతులను కలెక్టర్ ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఐసీడీఎస్ శాఖకు అందించారు.ఈ కార్యక్రమంలో టిఎన్జిఓ అధ్యక్షులు ఎన్.వెంకట్ రెడ్డి, టిజిఓ అధ్యక్షులు డా. ఆర్. దేవేందర్, సెక్రటరీ సాయి రెడ్డి, టీఎన్జీవో నాయకులు సంతోష్, శివకుమార్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క
బుధవారం 09 అక్టోబర్ 2024







# పుష్ప-2 కోసం శరవేగంగా షూటింగ్

మూడేళ్ళుగా బన్నీ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం పుష్ప 2..అనేక కారణాల వల్ల ఈ సినిమా షూట్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ క్రమంలో సినిమా రిలీజ్ డేట్ కూడా రెండు మూడు సార్లు మార్చారు. అందరి అభిమాన స్టార్ హీరోల నుండి సినిమాలు వస్తున్న బన్నీ ఫ్యాన్స్ కళ్ళు మాత్రం కాయలు కట్టాయి. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సుకుమార్ సినిమాని జెట్ స్పీడ్‌లో ముందుకు తీసుకెళ్తున్నాడు. ఓ వైపు గ్లిమ్స్, సాంగ్స్ అప్డేట్స్‌కి మంచి ఆదరణ లభించగా.. మరో రెండు వండర్ ఫుల్ అప్డేట్స్ ఫ్యాన్స్‌లో జోష్ పెంచుతున్నాయి. పుష్ప మేకర్స్ ఇప్పటికే ఈ సినిమాని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో షూటింగ్ లో వేగం పెంచిన దర్శకుడు సుకుమార్.. ఫస్ట్ హాఫ్ ఎడిట్ కాపీని లాక్ చేశారట. ఇక సెకండ్ హాఫ్ లో మిగిలి ఉన్న కొన్ని సన్నివేశాల షూట్ కోసం మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇందులో ఒక యూనిట్ రంపచోడవరంలో పని చేస్తుండగా మరో రెండు యూనిట్లు వైజాగ్, యానాంలో పని చేస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా రిలీజ్ దగ్గరపడటం, షూటింగ్ చకచకా సాగుతుండటం అభిమానులలో జోష్ పెంచింది. పుష్ప 1లో ఉన్న క్యారెక్టర్లనే ఈ సినిమాలో కొనసాగిస్తుండగా జగపతి బాబు అడిషినల్‌గా యాడ్ అయ్యారు. ఇక సినిమాలో ఒక ప్రత్యేకమైన ఐటమ్ సాంగ్ కోసం మొదట శ్రీలీలను సంప్రదించిన దిశా పటానిని ఓకే చేశారు. అయితే ఈ సినిమాలోని ఒక పోస్టర్ విషయానికొస్తే.. ఎర్ర చందనం వ్యాపారాన్ని చిటికెన వేలుపై నిలబెట్టి చేయదగలడని సూచనగా దాన్ని హైలైట్ చేస్తున్నట్లు వినిపిస్తోంది.

సుకుమార్ తెరకెక్కించే ప్రతి సీన్‌కు ఓ లాజిక్, కొన్ని రిఫరెన్స్‌లు ఉంటాయి.

జగపతిబాబు పాత్రకు పామును రిఫరెన్స్‌గా తీసుకున్నారు. సినిమా ప్రారంభంలో పామును ఏ విధంగా అయితే కొట్టి చంపుతారో అలాగే జగపతిబాబుని కూడా అలాగే కొట్టి చంపినట్లు చూపించారు. మరి ఇప్పుడు అల్లు గోరును హైలైట్ చేయడం వెనుక ఏముందో సుకుమార్ చెబితేనే బాగుంటుంది.




# గేమ్ ఛేంజర్ టీజర్ డేట్ ఛేంజ్

## దసరాకు కాదు...దీపవాళికి అంటూ తమన్ పోస్ట్

రామ్‌చరణ్– శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్' టీజర్ దసరాకు రావడం లేదు. దీపావళికి వస్తుందని తాజాగా దీనిపై సంగీత దర్శకుడు తమన్ పోస్ట్ పెట్టారు. టీజర్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దసరాకు టీజర్ రాలేదని నిరాశపడొద్దు ఫ్రెండ్స్. టీమ్ నిరంతరం ఆ పనుల్లోనే ఉంది. ప్రతినెలా ఒక లిరికల్ పాటను విడుదల చేయడం కోసం అన్ని పాటలకు లిరిక్స్ వర్క్ పూర్తి చేశాం. ఈ నెలలో అక్టోబర్ 30న ఒక పాట రానుంది. సినిమా డిసెంబర్ 20న కచ్చితంగా మీ ముందుకువస్తుంది' అని పోస్ట్ పెట్టారు. 'రా మచ్చా..' సాంగ్ వంద మిలియన్ల వ్యూస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇక ఓ నెటిజన్‌కు రిప్లై ఇస్తూ.. దీపావళికి టీజర్ ఉంటుందన్నారు. 'దీనీ టీజర్ కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని మేం అర్థం చేసుకోగలం. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. అవుట్‌పుట్ కోసం ఎక్కడా రాజీపడడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. దసరాకు విడుదల కాకపోతే దీపావళికి టీజర్ ఉంటుంది. దీనికి సంబంధించిన అప్‌డేట్స్ నేను ఎప్పటికప్పుడు అందిస్తుంటాను. మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అని అన్నారు. 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది.

ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి.

# అసలు కథంతా పార్ట్-2లోనే ఉంది



దేవర దర్శకుడు కొరటాల శివ వెల్లడి


కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన సినిమా 'దేవర'ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి విజయాన్ని అందుకొని ఎన్టీఆర్ అభిమానుల్లో జోష్ నింపింది. దీనికి కొనసాగింపుగా పార్ట్ 2 రానుందని దర్శకుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర 2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దీంతో అభిమానుల అంచనాలు రెట్టింపయ్యాయి. 'పార్ట్ 2లో జాన్వీ పాత్ర అసాధారణంగా ఉంటుంది. ఆశ్చర్యపోతారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు సీట్ ఎడ్జికి వస్తారు. ఒక దర్శకుడిగా నేను పార్ట్ 2 విషయంలోనూ ఎంతో నమ్మకంగా, ఆసక్తిగా ఉన్నాను. కథలో అసలు మలుపు పార్ట్ 2లోనే ఉంది. ప్రతీ పాత్ర హైలో ఉంటుంది. ఎన్టీఆర్ అభిమానులందరికీ ఒక్కటే చెబుతున్నా.. పార్ట్1లో మీరు చూసింది 10 శాతమే.. రెండో భాగంలో 100శాతం చూస్తారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుంది. కొన్ని సన్నివేశాలు మీరు జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అందిస్తాయి. ఈ విషయంలో ప్రామిస్ చేస్తున్నాను. తారక్ నటన గురించి చెప్పాల్సిన అవసరం లేదు. అతడు తన పాత్రకు జీవం పోస్తాడు' అని కొరటాల శివ 'దేవర 2' విషయంలో ధీమా వ్యక్తంచేశారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ కూడా 'దేవర 2' గురించి మాట్లాడిన సంగతి తెలిసిందే. మొదటిభాగం చిత్రీకరణ సమయంలోనే పార్ట్ 2లో కొన్ని సన్నివేశాలు షూట్ చేసినట్లు చెప్పారు. ఫస్ట్ పార్ట్ మంచి విజయం సాధించడంతో వారి బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందని తెలిపారు. కథ సిద్ధంగా ఉందని.. మెరుగులు దిద్దాలన్నారు. కొరటాల శివ 'దేవర' కోసం ఎంతో కష్టపడినట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'దేవర' ఇప్పటివరకు రూ.466 కోట్లు వసూలు చేసింది.త్వరలో రూ.500కోట్ల క్లబ్‌లోకి చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

# వెంకీ మూవీ సీరియల్ పై శ్రీను వైట్ల ఆసక్తి



రవితేజ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ' 2004లో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడమే కాదు.. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అందులోని పలు సన్నివేశాలను తలచుకోవడమే ఆలస్యం ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు పూస్తాయి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ ఏ హీరోతో చేస్తారనే ప్రశ్నకు శ్రీను వైట్ల సమాధానమిచ్చారు. ఆయన తాజా చిత్రం 'విశ్వం' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో 'వెంకీ' గురించి మాట్లాడారు. వెంకీ' సీక్వెల్ ఎవరితో చేస్తానేది చెప్పడం కష్టం. అందులో నటించే హీరో కచ్చితంగా నాకు మంచి స్నేహితుడై ఉండాలి. రవితేజ నాకు మంచి ఫ్రెండ్ కాబట్టి ఆ సినిమా అంత బాగా వచ్చింది. నేను ఏ హీరోతో చేసినా వాళ్లు నాకు స్నేహితులు అవుతారు. అలాంటి రిలేషన్ ఉన్నప్పుడే సినిమా బాగా వస్తుంది. ప్రస్తుతం చాలామంది టాలెంటెడ్ హీరోలు ఉన్నారు. వాళ్లందరూ కామెడీతో అలరిస్తున్నారు. వాళ్లలో ఎవరికైనా దీని సీక్వెల్ సెట్ అవుతుంది. ఒకరి పేరు చెప్పడం కష్టం అని చెప్పారు. 2004 మార్చి 26న విడుదలైన వెంకీ సంచలనం సృష్టించింది. రవితేజ పోషించిన వెంకీ పాత్ర, హీరోయిన్ స్నేహ నటించిన శ్రావణి పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి. హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్ అలాగే గజాలాగా బ్రహ్మానందం, బొక్కా సుబ్బారావుగా ఏవీఎస్.. ఇలా ప్రతిఒక్కరూ వారి కామెడీతో అదరగొట్టారు. ముఖ్యంగా ట్రైన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమా దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. దీనికి సీక్వెల్ రావాలని ఎంతోమంది కోరుకుంటున్నారు.

# రజనీకాంత్ సూచనతో ... వేట్టయాన్..కథలో మార్పు



రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రం 'వేట్టయన్' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఈ సినిమా కథ గురించి రజనీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టి.జె.జ్ఞానవేల్ మొదట తీసుకువచ్చిన కథకు రజనీ మార్పులు సూచించారట. దానిలో కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయమని కోరారట. కుమార్తె సౌందర్య సిఫార్సు మేరకు రజనీకాంత్ 'వేట్టయన్' కథను విన్నట్లు చెప్పారు. 'టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో వచ్చిన 'జైభీమ్' సినిమా నాకెంతో నచ్చింది. కానీ, గతంలో జ్ఞానవేల్‌తో ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాలేదు. 'వేట్టయన్' కథ వినమని సౌందర్య నాకు చెప్పడంతో విన్నాను. బాగుందనిపించింది. అయితే, ఈ సినిమా తీయడానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. అందుకే కథలో కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరాను. 10 రోజుల సమయం అడిగాడు. 'కమర్షియల్ సినిమాగా మారుస్తాను. కానీ, నెల్సన్ దిలీప్‌కుమార్, లోకేశ్ కనగరాజ్‌ల సినిమాగా మార్చలేను. నా శైలిలో ప్రేక్షకులకు నచ్చేలా ఈ కథను మారుస్తాను' అని జ్ఞానవేల్ చెప్పాడు. 'నాకు అదే కావాలి.. లేదంటే లోకేశ్, దిలీప్‌ల దగ్గరకే వెళ్లేవాడిని కదా' అని చెప్పా. 10 రోజుల తర్వాత కథలో మార్పులు చేసి తీసుకొచ్చాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను' అని రజనీకాంత్ తెలిపారు. ఈ సినిమాకు అనిరుధ్ మాత్రమే సంగీత దర్శకుడిగా ఉండాలని జ్ఞానవేల్ పట్టుపట్టినట్లు రజనీ గుర్తుచేసుకున్నారు. తమిళనాడులో గతంలో జరిగిన ఓ బూటకపు ఎన్‌కౌంటర్ నేపథ్యంతో దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇది రజనీకాంత్‌కు 170వ చిత్రం. ఆయన ఇందులో రిటైర్డ్ పోలీసు అధికారిగా కనిపించనున్నట్టు సమాచారం. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికాసింగ్, మంజు వారియర్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. తెలుగులోనూ అదే పేరుతో విడుదల కానుంది.